క్లుప్తంగా

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మత్తుల కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 7 నుంచి 10.30 గంటల వరకూ వెంకటేశ్వర మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, శ్యామల నగర్, గాంధీపురం, పాత సోమాలమ్మ గుడి రోడ్డు, రహమత్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.
- ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ పుష్కరాల రేవు, గోదావరి గట్టు, హెడ్ వాటర్ వర్క్స్, సర్కిల్ ఆఫీస్, రిలయన్స్ మార్ట్, కలెక్టర్ బంగ్లా తదితర ఏరియాల్లో సరఫరా నిలిచిపోతుంది.
- ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ క్వారీ మార్కెట్, కోరుకొండ రోడ్డు, సింహాచల నగర్, సుబ్బారావు నగర్, సీటీఆర్ఐ ఆటోస్టాండు, ఎమ్ఎస్ఆర్ నగర్, బర్మా కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, ఇంద్ర అపార్టుమెంట్, పోస్టాఫీసు, రామదాసుపేట, రాజా థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ ఆగిపోతుంది.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



బొమ్మూరులో ర్యాలీ నిర్వహిస్తున్న చాందిని తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కౌమర దశలోని బాలికలు కిశోర వికాసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బొమ్మూరు గ్రామ సచివాలయం -3 మహిళా సంరక్షణ కార్యదర్శి చాందిని అన్నారు. బొమ్మూరు రాఘవేంద్రనగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర వికాసం అవగాహన సదస్సు నిర్వహించారు. కౌమర దశలో రక్తహీనత అనే అంశంపై ఆమె అవగాహన కల్పించారు.. కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ముందుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పద్మజ, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు వాయిదా

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారికి హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. ఈ విషయాన్ని ఎంపీడీవో డి.శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలను తదుపరి ఎప్పుడు నిర్వహించేదీ తెలియజేస్తామన్నారు.

తిరంగా యాత్రను విజయవంతం చేద్దాం

సీటీఆర్ఐ: ఆపరేషన్ సిందూర్ విజయం సందర్భంగా శనివారం నగరంలో నిర్వహించే తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో పార్టీ నగర సమన్వయ కమిటీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ దేశ ప్రజలందరికీ గర్వకారణమైన విజయమన్నారు. ఈ తిరంగా యాత్ర శనివారం సాయంత్రం 4 గంటలకు పుష్కరాల రేవు నుంచి కోటగుమ్మం, మెయిన్ రోడ్డు మీదుగా కోటిపల్లి బస్టాండ్ వరకూ జరుగుతుందన్నారు. సుమారు 5 వేల జాతీయ పతాకాలతో ఈ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

సెల్ ఫోన్ ఇవ్వలేదని అలిగిన బాలిక

- ఇంటి నుంచి అదృశ్యం
- పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం రూరల్: సెల్ ఫోన్ ఇవ్వలేదని అలిగి ఇంటి నుంచి వెళ్లిన తన కుమార్తె ఇప్పటి వరకూ తిరిగి రాలేదని హుకుంపేట డి బ్లాకుకు చెందిన చిన్నమ్ములు శుక్రవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. హుకుంపేట డి బ్లాకుకు చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆ బాలికకు ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తి పరిచయమయ్యాడు. అతడితో ఆ బాలిక తరచూ మాట్లాడుతోందని గత నెల 23న తల్లిదండ్రులకు తెలిసింది. దీంతో వారం రోజుల తర్వాత గట్టిగా మందలించారు. అయితే అతడు ఎవ్వరో తెలియదని బాలిక బదులిచ్చింది. ఈ గొడవ నేపథ్యంలో బాలిక నుంచి సెల్‌ఫోన్‌ను తల్లిదండ్రులు తీసేసుకున్నారు. అయితే తనకు ఫోన్ ఇస్తే ఇంటిలో ఉంటానని, లేకపోతే వెళ్లిపోతానని ఆ బాలిక బెదిరించింది. ఈ నెల 12వ తేదీ సాయంత్రం తండ్రికి ఫోన్ చేసి, సెల్ ఫోన్ ఇస్తారా, వెళ్లిపోమంటారా అని అడిగింది. దానికి తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో ఇంటికి రాలేదు. ఇదిలా ఉండగా.. ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఆరు గంటల సమయంలో బాలిక తల్లిదండ్రులకు ఫోన్ కాల్ వచ్చింది. అటువైపు నుంచి ఒక వ్యక్తి మాట్లాడుతూ మీ అమ్మాయి విజయవాడలో మా దగ్గరుంది, పది మందితో రండి సెటిల్ చేసుకుందామని చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు 14వ తేదీన ఆ నంబర్‌కు ఫోన్ చేసి తమ అమ్మాయి కోసం అడిగారు. కానీ అవతలివైపు వాళ్లు మీ అమ్మాయిని పంపించబోం, ఏం చేసుకుంటారో చేసుకోండి అని సమాధానం చెప్పారు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డెక్కితే దడ దడే..



మల్లయ్యపేట రోడ్డులో ఇసుక లారీ వెళుతున్నప్పుడు రేగుతున్న దుమ్ము



మల్లయ్యపేట రోడ్డుపై ఇసుక మేటలు

- యథేచ్ఛగా ఇసుక లారీల రాకపోకలు
- రోడ్డుపై జారి పడుతున్న ఇసుక
- వెనుక వచ్చేవారికి అవస్థలు
- నిబంధనలు బేఖాతరు



రోడ్డుపై దట్టంగా పేరుకుపోయిన ఇసుక

రాజమహేంద్రవరం రూరల్: గతంలో వాహన చోదకులు ప్రయాణం చేసేటప్పుడు రోడ్డుపై ఉండే గోతులు, ట్రాఫిక్, రాంగ్ రూట్‌లో వచ్చే కొన్ని వాహనాలతో అప్రమత్తంగా ఉండేవారు. వాటిని చూసుకుంటూ జాగ్రత్తగా తమ వాహనాన్ని నడిపేవారు. ఇప్పుడు వారికి కొత్త సమస్య ఏర్పడింది. పరిమితికి మంచి లోడుతో వెళుతున్న లారీల నుంచి ఇసుక జారి రోడ్లపై పడుతోంది. దీంతో ఆయా రహదారులపై వెళ్లే వాహన చోదకులు జారి పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లోని రోడ్లపై ఇసుక కారణంగా పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. పరిమితికి మంచి వేగం, ఇసుక లోడుతో వెళ్లే లారీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అక్రమ రవాణా

గోదావరి గర్భాన్ని తొలిచేస్తూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న అక్రమార్కులు.. రోడ్డుపై వాహన చోదకులు భద్రతను కూడా గాలికి వదిలేస్తున్నారు. వీలైనంత వేగంగా దోచుకుపోవాలనే ఉద్దేశంతో లారీలపై పరిమితికి మించి ఇసుక లోడు వేసుకుని వెళుతున్నారు. అయితే దారిలో ఆ ఇసుక జారి రోడ్డుపై పడుతోంది. వెనుక వచ్చే వాహన చోదకులకు భయాందోళన కలిగిస్తోంది.

వాహనచోదకుల అవస్థలు

రాజమహేంద్రవరం, కాతేరు ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక రవాణా చేసేటప్పుడు పేపరుమిల్లు దాటిన తర్వాత పెట్రోలు బంకు నుంచి మల్లయ్యపేట, కాతేరు వెళ్లే రోడ్డులో ఇసుక కింద పడి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిమితికి మించి ఇసుక లోడు వేయడం వలన రోడ్డుపై ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. వాటిపై వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము లేచిపోతోంది. దీంతో ప్రయాణం నరకంగా మారిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక లారీలు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

ఇసుకను రవాణా చేసే సమయంలో వెనుక వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా లోడుపై మూతవేయాలని నిబంధనలు చెబుతున్నాయి. పరిమితికి లోబడి లోడు చేసిన వాహనాలు వల్ల పెద్దగా ఇబ్బందులు కలగడం లేదు. కానీ పరిమితికి మించి లోడు చేసుకున్న వాహనాల నుంచి దారి పొడవునా ఇసుక జారి పడుతోంది. ఆ వాహనం పక్కన ప్రయాణించే వారి కళ్లల్లో పడడమే కాకుండా వాహనాలు జారి ప్రమాదాలకు దారి తీస్తోంది. రాత్రింబవళ్లు యథేచ్ఛంగా అధిక లోడు లారీలు వెళుతున్నప్పటికీ పోలీసు, రవాణా శాఖల యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవు.

దోమల వ్యాధులపై అవగాహన కల్పించాలి



డెంగీ దినోత్సవ ర్యాలీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు
- ఉత్సాహంగా డెంగీ దినోత్సవ ర్యాలీ

రాజమహేంద్రవరం రూరల్: దోమల కారణంగా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'పరిశీలించండి, శుభ్రం చేయండి, మూతలు పెట్టండి' అనే మూడు నినాదాలను ఈ ఏడాది థీమ్‌గా తీసుకోవడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. ప్రజలందరూ తమ ఇంటి లోపల, పరిసరాల్లో దోమలు పెరుగుదలకు అవకాశం ఉన్న నీటి నిల్వలను తొలగించాలన్నారు. ఇళ్లలో నిల్వ ఉంచుకొనే నీటిపై తప్పకుండా మూతలు పెట్టాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకొని, సరైన వైద్యం సకాలంలో పొందాలన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది నినాదాలు చేస్తూ డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా కార్యాలయ సిబ్బంది, డిప్యూటీ డెమో ఎస్.సత్యకుమార్, సీహెచ్ఓ శర్మ, వివిధ ప్రోగ్రాం ఆఫీసర్లు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చైతన్యంతో సమాజ పురోగతి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న రాష్ట్ర సేవికా సమితి సభ్యులు

సీటీఆర్ఐ: కుటుంబానికి, దేశానికి స్త్రీశక్తి స్ఫూర్తిదాయకమని, మహిళా చైతన్యంతోనే సమాజ పురోగతి సాధ్యమని రాష్ట్ర సేవికా సమితి ప్రాంత సహ కార్యవాహిక ఉజ్వల అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో దేశంలోని మహిళలు సమీకరించి, ఏటా వారికి శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా దివాన్ చెరువులోని శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల ప్రాంగణంలో 15 రోజులుగా యువతులకు, మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరంలోని ప్రకాశం నగర్ రౌండ్ పార్కు నుంచి రూట్ మార్చ్ ప్రారంభించారు. వై.జంక్షన్‌లోని అబ్దుల్ కలాం విగ్రహం మీదుగా జాంపేట గాంధీ బొమ్మ నుంచి తిరిగి ప్రకాశం నగర్ వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఉజ్వల మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా, శక్తివంతమైన సమాజ నిర్మాణం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ప్రధాన కూడళ్లలో తాగునీటి ఏర్పాట్లు



సమావేశంలో పాల్గొన్న జేసీ చిన్నరాముడు తదితరులు

సీటీఆర్ఐ: వేసవి నేపథ్యంలోని జిల్లాలోని అని రహదారులు, ప్రధాన కూడళ్లలో ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు అన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహణపై ఆయన శుక్రవారం తన చాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తితో కలిసి జూమ్ కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయ శాఖల అధికారులు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎక్కడికక్కడ చల్లని తాగునీరు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. శనివారం ముఖ్య కూడళ్లలో, సచివాలయం పరిధిలో ఆయా ఏర్పాట్లు చేయాలన్నారు. పశువులు, పక్షుల కోసం నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వృద్ధులు, చిన్నారుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దానిలో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వాతావరణంలో మార్పుల వల్ల ఉరుములు – మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- నందడిగా వేసవి క్రీడా శిబిరాలు
- ఆసక్తి చూపుతున్న చిన్నారులు
- వివిధ రకాల క్రీడల్లో శిక్షణ
- అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో 50 కేంద్రాలు



వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన జాహిత గుణ

ప్రకాశం నగర్: వేసవి సెలవులను చిన్నారులు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడుపుతున్నారు. తమకు నచ్చిన క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్నారు. ఇప్పటి వరకూ చదువులతో కుస్తీ పట్టిన వారందరూ ఇప్పుడు ఆటలపైనా ఆసక్తి చూపుతున్నారు. ఇందుకోసం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా నగర పరిధిలో సుమారు 20 క్రీడా శిబిరాలు, అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 50 సెంటర్లలో శిక్షణ ఇస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఒక కేంద్రం నుంచి కనీసం 25 మంది బాలురు, 25 మంది బాలికలు తమ ఆసక్తిని బట్టి అండర్ – 14 విభాగంలో ఆయా క్రీడల్లో మెళకువలు నేర్చుకుంటున్నారు. నగరంలోని ఎస్‌కేవీటీ క్రీడా మైదానం, ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం, డీఎంహెచ్ స్కూల్ క్రీడా ప్రాంగణం, స్టేడియం, నన్నయ పాఠశాల క్రీడా మైదానాల్లో ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, బాక్సింగ్, క్రికెట్, వాలీ బాల్, అథ్లెటిక్స్‌తో పాటు ఖోఖో, హాకీ, టెన్నిస్ విభాగాల్లో శిక్షణ పొందుతున్నారు. వీరికి ఆయా జిల్లా క్రీడా అసోసియేషన్లు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు తర్ఫీదు ఇస్తున్నారు. మే ఒకటిన ప్రారంభమైన ఈ తరగతులు 31వ తేదీ వరకూ కొనసాగుతాయని జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి తెలిపారు.

జాతీయ పోటీలకు భవ్యశ్రీ

నగరంలోని మూడో వార్డు నెహ్రూ నగర్ మున్సిపల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కారుమూరి భవ్యశ్రీ ఫుట్‌బాల్ అండర్ -14 విభాగంలో స్కూల్ గేమ్స్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటింది. తద్వారా జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఆ బాలికను ఇటీవల పాఠశాల ప్రాంగణంలో జిల్లా విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు, అర్బన్ డీఐ బి.దిలీప్ కుమార్ అభినందించారు. అలాగే ఇంపాల్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ పోటీల్లో లాలాచెరువు ఎంపీఎల్ కార్పొరేషన్ స్కూల్ విద్యార్థిని జాహిత గుణ వెయిట్ లిఫ్టింగ్‌లో అండర్– 17 బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది.



జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన భవ్యశ్రీని అభినందిస్తున్న డీఈవో వాసుదేవరావు



ఎస్‌కేవీటీ క్రీడా మైదానంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

మానసిక ఉల్లాసం

క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసం చేకూరుతుంది. వేసవి సెలవులో సమయం వృథా కాకుండా విద్యార్థులు వారికి నచ్చిన ఆటలో మెళకువలు నేర్చుకోవాలి. క్రీడల్లో ప్రతిభ కనబరించేందుకు ఇటువంటి శిక్షణ శిబిరాలు క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడతాయి.

– కేవీ స్వామి,
జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి

ముస్లింలందరూ జగనన్న వెంటే..

- జకియాఖానం పార్టీని వీడడం దారుణం
- జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఆరిఫ్



మాట్లాడుతున్న మహ్మద్ ఆరిఫ్

సీటీఆర్ఐ: అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ముస్లింలందరూ జగనన్న వెంటే ఉంటారని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ ఆరిఫ్ అన్నారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ జకియాఖానం వైఎస్సార్ సీపీని వీడి బీజేపీలో చేరడాన్ని ఖండించారు. ఈ సందర్భంగా శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ ముస్లిం మహిళలు అభివృద్ధి సాధించాలని, విద్య, ఉద్యోగ, ఉపాధితో పాటు రాజకీయాలలో సైతం రాణించాలనే ఉద్దేశంతో సాధారణ గృహిణి అయిన జకియాఖానంను జగన్ ఎమ్మెల్సీగా చేసి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా అత్యున్నత స్థానం కల్పించారన్నారు. ఆమె బీజేపీలో చేరడం కేవలం పార్టీకి చేసిన ద్రోహం మాత్రమే కాదని, రాష్ట్రంలోని ముస్లిం మహిళల అభివృద్ధిని ప్రశ్నార్థకం చేశారన్నారు. జగనన్న ఇచ్చిన అవకాశాన్ని అధికారంలో ఉండగా అనుభవించి, ఇప్పుడు పార్టీ మారడం దారుణమన్నారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత ఉండవనే పదానికి ఆమె ప్రత్యక్ష ఉదాహరణగా మారారన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొస్తున్న నల్ల చట్టాలు, ప్రజావ్యతిరేక విధానాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఒక పక్క కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఉన్న ముస్లింలు, సెక్యులర్ వాదులు, మానవతావాదులు ఏకమై బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారన్నారు. ఈ తరుణంలో సెక్యులర్ పార్టీ అయిన వైఎస్సార్ సీపీని వీడి బీజేపీలో చేరడం అంటే ఎంత దారుణమో జకియాఖానం ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు.

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు..

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు
- కార్యకర్తలకు భరోసా
- బొబ్బిల్లంకలో 'నా కార్యకర్తలు – నా కుటుంబం'
- హాజరైన మాజీ హోంమంత్రి వనిత, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



బొబ్బిల్లంకలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణు, చిత్రంలో తానేటి వనిత, జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ఎవ్వరూ అధైర్యపడొద్దని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బొబ్బిల్లంకలో పార్టీ నాయకుడు మల్లిన చౌదరి నివాసం వద్ద శుక్రవారం 'నా కార్యకర్తలు – నా కుటుంబం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వేణు, మాజీ హోంమంత్రి వనిత సమావేశమయ్యారు. తొలుత ఈ కార్యక్రమానికి వచ్చిన నాయకులను బొబ్బిల్లంక శివారు నుంచి భారీ ర్యాలీతో ఆహ్వానించారు.

కూటమి ప్రభుత్వంలో దాడులు

మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దాడులు పెరిగిపోయాయన్నారు. వారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పట్టించుకోకుండా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయకుండా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. గ్రామస్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు నడుం బిగించాలన్నారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజల పక్షాన పోరాటం చేయాలన్నారు. మాజీ హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతం, విజయం కోసం అంకితభావంతో పనిచేద్దామని పిలుపునిచ్చారు.

ప్రజల పక్షాన..

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రతి నిత్యం ప్రజాపక్షమేనని అన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై దృష్టి సారించకుండా కూటమి నాయకులు కేవలం వైఎస్సార్ సీపీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను పెంచి సామన్య ప్రజలపై భారం మోపారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తామన్నారు. ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారని, రానున్న రోజుల్లో పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. పార్టీ పటిష్టతకు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ గంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, పార్టీ నాయకులు మెల్లిమి రామచంద్రరావు, చల్లమళ్ల సుజీరాజు, మొగలపు శ్రీనివాస్, చిన్నా, దుర్గారావు పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: మండలంలోని కౌలు రైతులు సీసీఆర్‌సీ (కౌలు కార్డులు) కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో కౌలు వ్యవసాయం చేస్తున్న రైతులు వాటికి అర్హులన్నారు. భూమి యజమాని నుంచి సదరు భూమి వివరాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఫోన్ నెంబరును జతపరిచి ఆయా గ్రామాల్లోని వీఆర్వో, వీఆర్ఏలకు అందజేయాలన్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం కౌలు కార్డులు పొందవచ్చన్నారు.

ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని నగరపాలకసంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. ఆయన శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని అన్ని విభాగాల హెచ్‌ఓడీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజులుగా వచ్చిన అర్జీలపై యాక్షన్ టేకెన్ రిపోర్టు సిద్ధం చేయాలన్నారు. నగరాభివృద్ధిలో భాగంగా జరుగుతున్న పనులను సమీక్షించడంతో పాటు, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్రలో భాగంగా బీట్ ద హీట్ కార్యక్రమంపై, వడగాలుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలను ప్రజలకు వివరించాలన్నారు. శనివారం జరిగే తిరంగా యాత్రలో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండల నేపథ్యంలో ప్రజలకు చల్లని తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సెక్రటరీ జి.శైలజావల్లి, సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ వినూత్న, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

35 కేజీల బియ్యం కార్డులు మంజూరు చేయాలి



ముత్యాల పోసికుమార్

ధవళేశ్వరం: శారీరక ఒంటరి దివ్యాంగులకు 35 కేజీల బియ్యం కార్డులు మంజూరు చేయాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ డిమాండ్ చేశారు. కొత్త రేషన్ కార్డులకు ప్రభుత్వం ఇటీవల కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. దానిలో భాగంగా శారీరక ఒంటరి దివ్యాంగులకు 35 కేజీల బియ్యం కార్డుల మంజూరు చేయడం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. చాలా వరకు దివ్యాంగులు నిరాశ్రయులుగా ఉంటున్నారని వారిని ప్రభుత్వం ఆదుకున్నట్లు అవుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి 35 కేజీల బియ్యం కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సినిమాలు



శ్యామల	: శుభం
సూర్యమినీ	: ఫైనల్ డెస్టినేషన్
సూర్యప్యాలెస్	: మిషన్ ఇంపాజిబుల్
స్వామి	: మిషన్ ఇంపాజిబుల్
శివజ్యోతి	: హిట్-3
అనుశ్రీ	: ఫైనల్ డెస్టినేషన్
రాజా	: ఫైనల్ డెస్టినేషన్
ఊర్వశి	: లవ్‌లీ
మేనక	: ఎలెవన్
రంభ	: 23
కుమారి	: మిషన్ ఇంపాజిబుల్
అప్సర	: సింగిల్
అశోక	: ఫైనల్ డెస్టినేషన్
నామవరం	
వీఎస్ మహల్	: మిషన్ ఇంపాజిబుల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మిషన్ ఇంపాజిబుల్, సింగిల్
కడియం	
వెంకటసూర్య	: మిషన్ ఇంపాజిబుల్